# గిరిజన పల్లెలకు బీటీ రోడ్లు

- ఐటీడీఏ పరిధిలోని 500 గ్రామాల అనుసంధానం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ. 411కోట్లతో 300 రోడ్లు
- పెరుగనున్న రవాణా సౌకర్యం
- తొలగనున్న గిరిజనుల ఇబ్బందులు



బీటీ రోడ్డుగా మారనున్న శంకరాజుపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు

ఏటూరునాగారం, అక్టోబర్ 4 : ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలోని ములుగు, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ జిల్లాల్లోని గిరిజన తండాలు, పల్లెలకు మధ్య గ్రామాలతో పాటు ప్రధాన రహదారులను అనుసంధానం చేసేందుకు 300 బీటీ రోడ్లకు టీఎస్ఎస్‌డీఎఫ్ కింద రూ. 411 కోట్లు మంజూరైనట్లు ఐటీడీఏ పీవో అంకిత్ తెలిపారు. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ నిర్వహిస్తున్నామని చెప్పారు. దీంతో అనేక గ్రామాలకు రవాణా సౌకర్యం ఏర్పడుతుందన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షణలో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సకాలంలో నాణ్యతతో నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. పనులను పర్యవేక్షించేందుకు డీఈఈ, ఏఈఈలను కేటాయించినట్లు తెలిపారు. సుమారు 500 గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఏర్పడుతుందన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి 174 రోడ్లకు రూ. 234 కోట్లను ప్రభుత్వం మంజూరు చేయగా, పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. 2023-24 సంవత్సరానికి కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలనే ఉన్నత లక్ష్యంతో ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని, రూ. 411.45 కోట్లతో 475 కిలోమీటర్ల బీటీ రోడ్లు నిర్మిస్తామని ఆయన వివరించారు. ములుగు జిల్లాలోని తొమ్మిది మండలాల్లో 36 రోడ్లకు రూ. 51 కోట్లు, భూపాలపల్లి జిల్లాలోని రెండు మండలాల్లో ఏడు రోడ్లకు రూ. 16.34 కోట్లు, జనగామ జిల్లాలోని ఆరు మండలాల్లో 16 రోడ్లకు 18.43కోట్లు, హనుమకొండ జిల్లాలోని మూడు మండలాల్లో తొమ్మిది రోడ్లకు 31.24 కోట్లు, వరంగల్ జిల్లాలోని తొమ్మిది మండలాల్లో 57 రోడ్లకు రూ. 55.61కోట్లు, మహబూబాబాద్ జిల్లాలోని 18 మండలాల్లో 175 రోడ్లకు రూ. 238.8 కోట్లను మంజూరు చేశారు.

### వరంగల్ జిల్లాలో...

వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి మండలంలో 23.15 కిలోమీటర్ల మేర 11రోడ్ల కోసం రూ.15.36 కోట్లు, నర్సంపేట మండలంలో 4.43 కి.మీ ఆరు రోడ్లకు రూ. 3.38కోట్లు, నెక్కొండ మండలంలో 18.10 కి.మీ 19 రోడ్లకు రూ.14.03 కోట్లు, చెన్నారావుపేట మండలంలో 3.73 కి.మీ ఆరు రోడ్లకు రూ. 2.98కోట్లు, ఖానాపురం మండలంలో అర కిలోమీటర్ రోడ్డు కోసం రూ. 47లక్షలు, దుగ్గొండి మండలంలో 1.20 కిలోమీటర్ల రోడ్డు కోసం రూ. 1.20 కోట్లు, పర్వతగిరి మండలంలో 3.10 కిలోమీటర్ల రెండు రోడ్లకు రూ. 2.48 కోట్లు, శాయంపేట మండలంలో 11.22 కి.మీ నాలుగు రోడ్లకు రూ. 10.05కోట్లు, రాయపర్తి మండలంలో 6.80 కి.మీ ఏడు రోడ్లకు రూ. 5.60 కోట్లు మంజూరు చేశారు.

### జనగామ, హనుమకొండ జిల్లాల్లో...

జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలో మూడు కిలోమీటర్ల మేర మూడు రోడ్ల కోసం రూ. 2.05 కోట్లు, పాలకుర్తి మండలంలో మూడు కిలోమీటర్ల మూడు రోడ్లకు రూ. 2.72కోట్లు, కొడకండ్ల మండలంలో 80మీటర్ల రోడ్డుకు రూ. 72లక్షలు, చిల్పూర్ మండలంలో 2.70 కి.మీ రెండు రోడ్ల కోసం రూ. 2.16కోట్లు, జఫర్‌గఢ్ మండలంలో 1.30 కిలోమీటర్ల రోడ్డుకు రూ. 1.04కోట్లు, రఘునాథపల్లి మండలంలో 12.15 కి.మీ ఆరు రోడ్ల కోసం రూ. 9.72కోట్లు, హనుమకొండ జిల్లా నడికూడ మండలంలో 4.40 కి.మీ రోడ్డుకు రూ. 15కోట్లు, వేలేరు మండలంలో 17.60 కి.మీ ఏడు రోడ్లకు రూ. 14.08 కోట్లు, ధర్మసాగర్ మండలంలో 2.70 కిలోమీటర్ల రోడ్డుకు రూ. 2.16కోట్లు మంజూరయ్యాయి.

### ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో...

గోవిందరావుపేట మండలంలో 5.61 కి.మీ ఏడు రోడ్లకు రూ. 4.61కోట్లు, ములుగు మండలంలో 18.40 కి.మీ ఏడు రోడ్లకు రూ. 14.61కోట్లు, వెంకటాపూర్ మండలంలో 60 మీటర్ల రోడ్డుకు రూ. 48లక్షలు, వెంకటాపురం మండలంలో 13.20 కి.మీ 11 రోడ్లకు రూ. 10.56కోట్లు, వాజేడు మండలంలో 1.03 కిలోమీటర్ల రోడ్డుకు రూ. 1.04కోట్లు, కన్నాయిగూడెం మండలంలో 2.70 కిలోమీటర్ల మేర రెండు రోడ్లకు రూ. 2.16కోట్లు, ఏటూరునాగారం మండలంలో 3.80 కి.మీ మూడు రోడ్లకు రూ. 3.04కోట్లు, తాడ్వాయి మండలంలో 10కి.మీ రెండు రోడ్లకు రూ. 8కోట్లు, మంగపేట మండలంలో 8.50 కి.మీ రెండు రోడ్లకు రూ. 6.60 కోట్లు మంజూరు చేశారు. భూపాలపల్లి జిల్లాలో భూపాలపల్లి మండలంలో 14.10 కి.మీ ఐదు రోడ్లకు రూ. 12.74కోట్లు, చిట్యాల మండలంలో నాలుగు కిలోమీటర్ల నిడివి గల రెండు రోడ్లకు రూ. 3.60కోట్లు మంజూరు చేశారు.

### మహబూబాబాద్ జిల్లాలో..

మహబూబాబాద్ జిల్లాలోని మరిపెడ మండలంలో 32.85 కిలోమీటర్ల నిడివి గల 25 బీటీ రోడ్ల కోసం రూ. 27.16 కోట్లు, కురవి మండలంలో 34.80 కి.మీ 23 బీటీ రోడ్లకు రూ.43.43కోట్లు, సీరోల్ మండలంలో రెండు కి.మీ రోడ్డు కోసం రూ.1.5 కోట్లు, డోర్నకల్ మండలంలో 33 కి.మీ 13 రోడ్ల నిర్మాణం కోసం రూ.25.57కోట్లు, దంతాలపల్లిలో 14 కి.మీ 8 రోడ్లు నిర్మించేందుకు రూ. 10.85 కోట్లు, చిన్నగూడూరు మండలంలో నాలుగున్నర కిలోమీటర్ల నాలుగు రోడ్లకు 3.60కోట్లు, నర్సింహులపేటలో మూడు కిలోమీటర్ల మూడు రోడ్లకు రూ. 3.15 కోట్లు, మహబూబాబాద్ మండలంలో 14.60 కి.మీ 14 రోడ్లకు రూ. 12.14కోట్లు, కేసముద్రం మండలంలో 20.60 కి.మీ 14 రోడ్లకు రూ. 19.60 కోట్లు, ఇనుగుర్తి మండలంలో 9.50 కి.మీ 4 రోడ్లకు రూ.7.12 కోట్లు, నెల్లికుదురు మండలంలో 25.30 కి.మీ 17 రోడ్లకు రూ.19.47 కోట్లు, తొర్రూరు మండలంలో 5.20 కి.మీ నాలుగు రోడ్లకు రూ.4.24కోట్లు, పెద్ద వంగర మండలంలో నాలుగు కిలోమీటర్ల రెండు రోడ్లకు రూ.3.20కోట్లు, గూడూరు మండలంలో 22.75 కి.మీ 21 రోడ్లకు రూ.18.57కోట్లు, కొత్తగూడ మండలంలో 15.30 కి.మీ ఎనిమిది రోడ్లకు రూ.14.71కోట్లు, గంగారం మండలంలో మూడు కిలోమీటర్ల నిడివి గల ఒక్క రోడ్డు నిర్మాణం కోసం రూ. 2.40కోట్లు, బయ్యారం మండలంలో 21.25కి.మీ 10 రోడ్ల కోసం రూ.20.17కోట్లు, గార్ల మండలంలో 2.60 కి.మీ మూడు రోడ్లకు రూ.1.82 కోట్లు మంజూరయ్యాయి.

## రెవెన్యూ డివిజన్‌గా ఏటూరునాగారం

- జీవో జారీ చేసిన ప్రభుత్వం.. హామీ ఇచ్చిన 10 రోజులకే ఆదేశాలు
- ఆరు మండలాలతో ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేసిన జడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి

ఏటూరునాగారం, అక్టోబర్ 7 : ఏటూరునాగారాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ మేరకు ప్రిలిమినరీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గత నెల 28న ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావు ములుగులో ఏర్పాటు చేసిన సభలో ఏటూరునాగారాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని ప్రకటించిన 10 రోజుల్లోనే జీవో జారీ అయ్యింది. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకుపోయి డివిజన్ కేంద్రం ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ నెరవేరింది. దీంతో ఏటూరునాగారం ప్రాంత అభివృద్ధికి మరో అడుగు ముందు పడినట్లయింది. ప్రభుత్వం ఏర్పాటైన అనంతరం ఏటూరునాగారాన్ని పోలీస్ సబ్ డివిజన్ కేంద్రంగా చేశారు. అంతే కాకుండా అటవీశాఖ ఫారెస్టు డివిజన్ కేంద్రం కూడా ఏర్పాటైంది. ఇక తాజాగా రెవెన్యూ డివిజన్ కావడంతో అనేక ఉన్నత స్థాయి కార్యాలయాలు ఇక్కడ ఏర్పాటు కానున్నాయి. గతంలో డివిజన్ కేంద్రంగా ఉన్న ములుగును జిల్లాగా ప్రకటించిన విషయం విధితమే. ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాలను కలుపుతూ డివిజన్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ములుగు జిల్లాలో ఒక రెవెన్యూ డివిజన్ కేంద్రం మాత్రమే ఉండగా ఏటూరునాగారంతో ఆ సంఖ్య రెండుకు పెరుగనుంది. వాజేడు, వెంకటాపురం, మంగపేట మండలాల్లోని మారుమూల గ్రామాల నుంచి ములుగులోని రెవెన్యూ డివిజన్ కేంద్రం సుమారు వంద కిలోమీటర్ల దూరం వరకు ఉండగా, ఏటూరునాగారం మాత్రం 50 కిలోమీటర్ల దూరంలోనే ఉండనుంది. ఎంతో కాలంగా ఏటూరునాగారాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలనే డిమాండ్ ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వం ఈ ప్రాంత ప్రజలకు తీపి కబురు అందించింది. ఇదిలా ఉండగా, ఏటూరునాగారంలో తహసీల్దార్ కార్యాలయం నూతన భవనం కోసం ప్రభుత్వం ఇటీవల రూ. 65 లక్షలు మంజూరు చేసింది. ఇదే ప్రాంగణంలో డివిజన్ కార్యాలయం కూడా ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయి. డివిజన్ కేంద్రం ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలకు పాలన చేరువ కానుంది. వాజేడు, వెంకటాపురం మండలాలు గతంలో భద్రాచలం డివిజన్ పరిధిలో ఉండగా, ములుగు జిల్లా ఏర్పాటుతో ములుగు డివిజన్ పరిధిలోకి వచ్చాయి. ఇప్పుడు ఏటూరునాగారం డివిజన్ పరిధిలోకి రానున్నాయి.

### డివిజన్ ఇవ్వడం సంతోషం..

**- బడే నాగజ్యోతి, జడ్పీ చైర్ పర్సన్, ఎమ్మెల్యే అభ్యర్థి**



ములుగు జిల్లాపై సీఎం కేసీఆర్ వరాల జల్లు కురిపిస్తున్నారు. ఏటూరునాగారాన్ని డివిజన్ కేంద్రంగా ప్రకటించడం హర్షణీయం. ప్రజల కోరిక మేరకు మల్లంపల్లిని మండలంగా ప్రకటించారు. మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేసిన రోజే ఏటూరు నాగారాన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని మంత్రి హరీశ్‌రావును కోరాం. పది రోజుల్లో ఉత్తర్వులు రావడం సంతోషం. డివిజన్ ఏర్పాటుతో ఆరు మండలాలకు ప్రభుత్వ పాలన చేరువ కానుంది.

## 27లోపు వార్షిక పరీక్ష ఫీజు చెల్లించాలి

హనుమకొండ సిటీ, అక్టోబర్ 7 : డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ అభ్యసిస్తున్న రెగ్యులర్ విద్యార్థులతో పాటు గతంలో ఉత్తీర్ణత కాని విద్యార్థులు ఈ నెల 27 లోపు వార్షిక ఫీజు రూ. 150 చెల్లించాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 50 అపరాధ రుసుముతో వచ్చే నెల 3వరకు చెల్లించే అవకాశం ఉందన్నారు.

## వరంగల్ రీజియన్‌కు మొదటి బహుమతి

- ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా బహుమతి అందుకున్న ఆర్ఎం శ్రీలత

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 7 : రాఖీ, శ్రావణ మాసం సీజన్లలో ఆర్టీసీ వరంగల్ రీజియన్ రాష్ట్రంలోనే అత్యధిక లాభాలు గడించి మొదటి బహుమతి గెలుచుకున్నది. శనివారం హైదరాబాద్ ఆర్టీసీ కళా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఒక్కో చాలెంజ్‌లో నగదు బహుమతి రూ.లక్ష చొప్పున రూ.2 లక్షల నగదుతో పాటు రెండు ట్రోఫీలు అందుకున్నది. వరంగల్ రీజియన్ తరపున వరంగల్ రీజనల్ మేనేజర్ జే శ్రీలతతో పాటు డిప్యూటీ ఆర్ఎంలు కే భానుకిరణ్, జీ మాధవరావు, 9 డిపోల మేనేజర్లు ఈ బహుమతులను ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ చేతుల మీదుగా అందుకున్నారు. అదేవిధంగా జోనల్ స్థాయిలో వరంగల్ రీజియన్‌కు సంబంధించిన కండక్టర్లు, డ్రైవర్లు, మెకానికల్ సిబ్బందితో కలిపి మొత్తం 28 మందికి పురస్కారాలు అందజేశారు.




ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా నగదు బహుమతితో పాటు ట్రోఫీ అందుకుంటున్న ఆర్ఎం శ్రీలత, డీఎంలు

## సీఆర్‌టీల నియామకానికి దరఖాస్తులు

ఏటూరునాగారం, అక్టోబర్ 7 : ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్(సీఆర్‌టీ)ల కోసం గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ పీవో అంకిత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీలోగా అర్హులైన వారు దరఖాస్తులను ఆయా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్లకు అందజేయాలని కోరారు. భూపాలపల్లి జిల్లాలో రెండు హిందీ, ఒక ఇంగ్లిష్, నాలుగు గణితం, ఫిజికల్ సైన్స్, మహబూబాబాద్ జిల్లాలో రెండు ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్, ములుగు జిల్లాలో మూడు గణితం, ఒక ఫిజికల్ సైన్స్ పోస్టు ఖాళీగా ఉన్నాయని, టెట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## విద్యార్థి అదృశ్యం

డోర్నకల్, అక్టోబర్ 7 : విద్యార్థి అదృశ్యమైన ఘటన డోర్నకల్ మున్సిపాలిటీ పరిధి పంపుబావి తండాలో శనివారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బానోత్ భరత్ చంద్ర ఈ నెల 5వ తేదీ రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా, భరత్ చంద్ర చిల్కోడు మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు.



భరత్ చంద్ర (ఫైల్)

## 23నే దసరా..

- భద్రకాళీ దేవస్థాన సిద్ధాంతి అయినవోలు అనంత మల్లయ్య శర్మ

కాజీపేట, అక్టోబర్ 7 : తెలంగాణ విద్వత్ సభలో పండితుల నిర్ణయం, శాస్త్రం ప్రకారం ఈ ఏడాది విజయ దశమి పండుగను 23వ (సోమవారం) తేదీనే జరుపుకోవాలని వరంగల్ భద్రకాళీ దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి, గురు మహాదానంద సరస్వతీ పీఠం ఆస్థాన సిద్ధాంతి అయినవోలు అనంత మల్లయ్య శర్మ సూచించారు. కాజీపేట పట్టణంలోని శ్వేతార్క మూల గణపతి దేవాలయ ప్రాంగణంలో శనివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 23న సోమవారం నవమి-శ్రవణం కలిసి ఉన్నదని, మంగళవారం 24న దశమి ధనిష్ట కలిసి ఉన్నదని, అందువల్ల విజయ దశమిని 23నే జరుపుకోవాలన్నారు. పండుగ, శమీ పూజాదికాలు ఆ రోజే జరుపుకోవాలని తెలిపారు.